సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 17 । మార్చి । 2025



పునరావాసం ఎక్కడ సారూ?

పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌లో స్థలాలు అప్పగించకుండా గ్రామాలను ఖాళీ చేయమంటే ఎలా అని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. 8లో



ఆయిల్‌పామ్‌లో బొప్పాయి

మెట్ట ప్రాంతంలో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా బొప్పాయి సాగు చేస్తున్నారు. దిగుబడులు బాగుండటంతో విస్తీర్ణం పెరుగుతోంది. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహరి మంగళవారం (ఉదయం)
భీమవరం	6.19	4.49
నరసాపురం	6.20	4.48
తాడేపల్లిగూడెం	6.15	4.58

న్యూస్‌రీల్

ముగిసిన గుబ్బల మంగమ్మ జాతర



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈనెల 14న జాతర ప్రారంభం కాగా.. మూడు రోజులపాటు గిరిజన సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బాలరాజును సత్కరించారు. ఆఖరి రోజు సుమారు 11 వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించినట్టు ఆలయ కమిటీ ప్రతినిధి, సర్పంచ్ కోర్సా గంగరాజు తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు

భీమవరం : జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున సమీపంలోని అన్ని జెరాక్సు సెంటర్లను మూసివేయిస్తామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు అత్యవసర పరిస్థితులు ఎదురైతే 100 లేదా 112 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఉత్తరాంధ్ర జిల్లాలకు బస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఏపీఎస్‌ఆర్టీసీ భీమవరం డిపో నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు బస్సు సర్వీసులు ఏర్పాటుచేసినట్టు డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. భీమవరం నుంచి విశాఖ (వయా నవుడూరు, బ్రాహ్మణచెర్వు), భీమవరం నుంచి పలాస (వయా పాలకొల్లు, కాకినాడ, విశాఖ, శ్రీకాకుళం, టెక్కలి) సర్వీసులను ఆదివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబు జెండా ఊపి ప్రారంభించారన్నారు. జిల్లాలోని నవుడూరు, పాలమూరు, బ్రాహ్మణచెర్వు గ్రామాల ప్రజలు నేరుగా విశాఖ వెళ్లేందుకు ఈ సర్వీసులు దోహదపడతాయన్నారు.

కోకో నాణ్యత పెంచేలా శిక్షణ

ఏలూరు(మెట్రో): కోకో గింజల నాణ్యత పెంచేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. నాణ్యమైన గింజలు లేకపోవడంతో ధర రావడం లేదన్నారు. గింజల నాణ్యతలో కీలకమైన ఫైర్మెంటేషన్, ఎండబెట్టడం, శుభ్రమైన ప్రదేశాల్లో భద్రపరచడం వంటి మెలకువలపై మోండలీజ్ సాంకేతిక అధికారుల సమన్వయంతో గ్రామాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆదివారం రామశింగవరం, కొండలరావుపాలెం, చక్రదేవరపల్లి, వంగూరు, తాళ్లగోకవరం తదితర గ్రామాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రైతులు అవగాహన పెంచుకుని గింజల నాణ్యతకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వడదెబ్బపై అప్రమత్తం

ఏలూరు(మెట్రో): రోజురోజుకూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. ఎండ తీవ్రత, వడగాల్పులు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నెత్తికి టోపీ లేదా రుమాలు కట్టుకొని, కాటన్ వస్త్రాలు ధరించాలని సూచించారు. తరచూ నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోస్, ఓఆర్‌ఎస్ కలిపిన నీటిని తాగాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ సేవలు దూరం

పేదలకు భారం

- వైద్య సేవ ఉద్యోగుల చర్చలు విఫలం
- నేడు, 24న విధుల బహిష్కరణ
- ఆరోగ్యశ్రీ కార్యాలయాల వద్ద నిరసన
- పథకాన్ని బీమా కంపెనీకి అప్పగిస్తామనడంపై ఆందోళన
- సమస్యల పరిష్కారానికి పోరుబాట



భీమవరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) ఓపీ విభాగం

ఉద్యోగుల డిమాండ్లు

- ఆరోగ్యశ్రీలో 17 ఏళ్లగా పనిచేస్తున్న వారిని సర్వీసును బట్టి ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి జీఓ నం.7లో కేటగిరీ–1 డీపీఓ క్యాడర్ అమలు చేయాలి.
- ఉద్యోగులందరికీ పనికి తగిన కనీస వేతనం అమలు చేయాలి, వేతనం పెంచాలి.
- సర్వీసును బట్టి పదోన్నతులు ఇవ్వాలి.
- ఉద్యోగి చనిపోతే వారి కుటుంబాలకు రూ.15 లక్షల సాయం అందించాలి.
- రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.10 లక్షల సాయం అందించాలి.
- ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలి.

జిల్లాలో ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు	36
మేనేజర్	1
టీమ్ లీడర్లు	4
ఆరోగ్యమిత్రలు	58
ఆఫీస్ స్టాఫ్	2

భీమవరం(ప్రకాశం చౌక్): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ)లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ కూటమి ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. నామమాత్రంగా జరిగిన అధికారులతో చర్చలు విఫలం కావడంతో సోమవారం, ఈనెల 24న (రెండు సోమవారాలు) విధులు బహిష్కరించాలని, జిల్లా ఆరోగ్యశ్రీ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఉద్యోగుల సంఘం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా రోజుల్లో పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు దూరం కానున్నాయి.

కీలకంగా ఉద్యోగులు

పేద, మధ్యతరగతి వర్గాల ఆరోగ్య పరిరక్షణలో ఆరోగ్యశ్రీ సేవలు కీలకం. వేలాది మంది ప్రాణాలు నిలపడంలో ఆరోగ్యశ్రీ ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం. ఆరోగ్యశ్రీ కార్డు కలిగి నెట్‌వర్క్, ప్రభుత్వాస్పత్రులకు వచ్చిన రోగులకు వెంటనే ఓపీ కార్డు రిజిస్ట్రేషన్ చేసి వైద్యుడి వద్దకు పంపుతారు. అలాగే ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అనుమతి వచ్చేలా చూడటం, రోగులకు భోజన సౌకర్యం నుంచి వారిని తిరిగి ఇంటికి క్షేమంగా పంపించే వరకూ సాయం ఉంటారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆసరా సాయం కింద వైద్యం పొందిన రోగులకు ఆర్థిక సాయం కూడా అందేది.

ఉద్యోగాలు ఉంటాయా.. ఊడతాయా..

ఆరోగ్యశ్రీ సేవలను నిర్వీర్యం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పథకంలో మార్పులు చేసి బీమా కంపెనీకి అప్పగించాలని చూస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. బీమా కంపెనీకి అప్పగిస్తే తమ ఉద్యోగాలు ఉంటాయో.. ఊడతాయోనని ఆందోళన చెందుతున్నారు. 17 ఏళ్లగా సేవలందిస్తున్న తమను తొలగిస్తారా అంటూ ఆవేదన చెందుతున్నారు. ఎప్పటికైనా తమ సర్వీసులను క్రమబద్ధీకరిస్తారని భావిస్తున్న తరుణంలో ఉద్యోగాలను తీసేవేసేలా కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. పథకాన్ని బీమా కంపెనీకి అప్పగిస్తే తమ ఉద్యోగాల పరిస్థితిపై వైద్యారోగ్య శాఖ లేదా ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

జిల్లాలో 65 మంది ఉద్యోగులు

జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, ఆకివీడు, పెనుగొండలో ఆరోగ్యశ్రీలో సేవలందించే ఆస్పత్రులు 36 ఉన్నాయి. వీటిలో నెట్‌వర్క్ ఆస్పత్రులు 28 భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో ఉన్నాయి. వీటితో పాటు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి (తణుకు), ఏరియా ప్రభుత్వాస్పత్రులు 4 (భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం), సీహెచ్‌సీలు 3 (పెనుగొండ, ఆచంట, ఆకివీడు)లో ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్నారు. మొత్తంగా 36 ఆస్పత్రుల్లో 65 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

పేదలకు తప్పనిపాట్లు

ఆరోగ్యశ్రీ ఉద్యోగులు విధులు బహిష్కరిస్తే ఆస్పత్రులకు వెళ్లే పేదలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఆరోగ్య మిత్రలు లేకపోతే ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఓపీ, అత్యవసర ఆపరేషన్లు చేయాల్సి వస్తే పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇది పేదల ఆరోగ్యంతో చెలగాటమే అని, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. సేవలందక ఎవరి ప్రాణాల మీదకైనా వస్తే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అంటున్నారు.

చెత్త కుప్పగా తణుకు పట్టణం

మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



ఏలూరు టౌన్: స్వచ్ఛతపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో తణుకు పట్టణం చెత్త కుప్పగా మారిందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చెత్త సేకరించే వ్యాన్‌లను మూలన పడేసి ట్రై సైకిళ్ల తీసుకువచ్చారని, ఫలితంగా చెత్త సేకరణ నామమాత్రంగా మిగిలిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని తెలిపారు. తణుకులో శ్లాటర్ హౌస్‌లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పశువధకు పాల్పడుతున్నారని విమర్శించారు. వందలాది పశువులను వధిస్తుండటంతో వేలాది లీటర్ల రక్తం భూమిలో ఇంకిపోతూ ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతూ, ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కు దీనిపై ప్రజలు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ పట్టించుకోలేదని చెప్పారు. శ్లాటర్ హౌస్ పేరుతో కోట్లాది డబ్బులు చేతులు మారుతున్నాయని, తణుకు ఎమ్మెల్యేకి పావలా ఎమ్మెల్యే అని ప్రజలు పేరుపెట్టారని గుర్తుచేశారు. తణుకు నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోందని, కోడిపందేలు, పేకాట క్లబ్బులు, గంజాయి, క్రికెట్ బెట్టింగులు, అశ్లీల నృత్యాలతో ఎమ్మెల్యే అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్టుగా జోరుగా సాగుతోందని మాజీ మంత్రి కారుమూరి విమర్శించారు.

అమరజీవి త్యాగం అజరామరం



ఏలూరులోని పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త జేపీ తదితరులు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఏలూరు టౌన్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను సైతం బలిదానం చేసి పొట్టి శ్రీరాములు అమరజీవిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ప్రకాశం రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఏలూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారంతా ఒకే రాష్ట్రంగా ఉండాలనే తపనతో ఆనాడు పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను సైతం పణంగా పెట్టారన్నారు. ప్రభుత్వాలు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, సీనియర్ నాయకులు గంటా మోహన్‌రావు, యూత్ అధ్యక్షుడు సాయి ప్రదీప్, లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి, జిల్లా కార్యదర్శి జనార్దన్, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ గాజుల బాజీ, ఆర్టీపీ విభాగం అధ్యక్షుడు మద్దాల ఫణి, డాక్టర్ వింగ్ అధ్యక్షుడు కొవ్వాడ దుర్గారావు, యువజన నాయకులు బండ్లమూడి సునీల్‌కుమార్, శంకర్, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్) : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలకు ఆమె హాజరయ్యారు. పట్టణంలోని మావుళ్లమ్మ గుడి వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణకు పొట్టి శ్రీరాములు జీవితాంతం కృషిచేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్ చానల్స్‌తో ముంపు నివారణ

- చానల్స్ ఆధునికీకరణతో నీటిపారుదల సుగమం
- ప్రత్యామ్నాయ మార్గాలే మేలంటున్న రైతులు



గత వర్షాకాలంలో అప్పారావుపేట సమీపంలో ఎర్రకాలువకు గండి పడిన ప్రాంతం

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్రకాలువ ముంపు కారణంగా ఏటా వందలాది ఎకరాల పంట నీట మునుగుతుంది. గతేడాది ఎర్రకాలువ గట్టుకు గండ్లు పడి వరి నాట్లు నీట మునగడంతో పాటు ఇసుక మేటలు వేశాయి. దీనికి శాశ్వత పరిష్కారం కోట్లాది రూపాయల ఖర్చుతో కూడుకున్నది. అయితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అదనపు నీటిని దారి మళ్లించడం వల్ల గట్లు సురక్షితంగా ఉంటాయని రైతులు అంటున్నారు. తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం నుంచి నందమూరు వరకు ఎర్రకాలువ ఆయకట్టు ఉంది. దీని పరిధిలో బంగారుగూడెం, వీరంపాలెం, పట్టింపాలెం, అప్పారావుపేట, జగన్నాథపురం, మాధవరం, కొత్తూరు, మారంపల్లి, నవాబుపాలెం, నందమూరు తదితర గ్రామాలు ఉన్నాయి. వర్షాకాలంలో ఎర్రకాలువ గట్టుకు గండ్లు పడి పంట నీట మునగడం పరిపాటిగా మారింది. పట్టింపాలెం, అప్పారావుపేట, బాపన్నకోడు, మాధవరం తదితర ప్రాంతాల్లో సబ్ చానల్స్ ఉన్నాయి. ముంపు నివారణలో సబ్ చానల్స్ ఎంతగానో ఉపకరిస్తాయని, అయితే సబ్ చానల్స్ నిర్వహణకు నోచుకోకపోవడంతో ముంపు తీవ్రస్థాయిలో ఉంటుందని రైతులు చెబుతున్నారు. సబ్ చానల్స్ ద్వారా ఎర్రకాలువ వరద నీరు ఏలూరు ప్రధాన కాలువలో కలిసే అవకాశం ఉందని, దీంతో గట్లకు గండ్లు పడే అవకాశం తక్కువని అంటున్నారు. ఎర్రకాలువ గట్లను పటిష్టం చేయాల్సి వస్తే రాయితో నిర్మాణం చేయాలని, ఇది వందలాది కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని అంటున్నారు.

రూ.10 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు

బంగారుగూడెం నుంచి నందమూరు వరకు ఉన్న ఎర్రకాలువ గట్టుకు పడిన 27 గండ్లను తాత్కాలికంగా పూడ్చేందుకు రూ.10 కోట్లతో అంచనాలు తయారు చేసి పంపినట్టు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. రానున్న వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేయడం ద్వారా ముంపు నివారించే అవకాశం ఉంది. లేకుంటే ఖరీఫ్ సీజన్‌లోనూ ఎర్రకాలువ ముంపు తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సబ్ చానల్స్‌ను ఆధునికీకరించాలి



ఎర్ర కాలువ వరద నీరు సబ్ చానల్స్ నుంచి మళ్లించడం వల్ల ముంపును నివారించవచ్చు. సబ్ చానల్స్ ఆధునికీకరణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకుంటే రానున్న వర్షాకాలంలోనూ ముంపు తప్పదు.

– గొరసా ఆదినారాయణ, అప్పారావుపేట

హేలాపురి సంగీత వైభవం



కృతులు ఆలపిస్తున్న సంగీత కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో గుడిపాటి లలిత సంగీత నిర్వహణలో హేలాపురి సంగీత వైభవం పేరిట నిర్వహించిన కార్యక్రమం వీనుల విందు చేసింది. నగరానికి చెందిన పలువురు గాయకులు సంగీత కృతులు ఆలపించి ఆకట్టుకున్నారు. సంగీత కచేరీ నిర్వహించిన కళాకారులకు వయోలిన్ ద్వారా వీరా శివప్రసాద్, మృదంగం ద్వారా సీహెచ్ లక్ష్మీ నారాయణన్, తబలా ద్వారా సీహెచ్ కల్యాణ్, ఫ్లూట్ ద్వారా కుమార్ బాబు, కీబోర్డ్ ద్వారా వెంకటేశ్వరరావు వాద్య సహకారం అందించారు. వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాట్నాలమ్మా.. నమోనమః

పెదవేగి: రాట్నాలకుంటలో రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అర్చకులు విశేష పూజలు చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు. ఆలయానికి పలు రూపాల్లో రూ.1,13,141 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు.

కౌలుకునేదెలా..?

నెత్తిన 'భూధార్' బండ

- ప్రభుత్వాల నిబంధనలతో ఇబ్బందులు
- సొంత పొలం ఉంటేనే భూధార్‌కు అర్హులు
- అవకాశం కోల్పోతున్న కౌలు రైతులు
- పథకాలు, రాయితీలు హుళక్కే
- జిల్లాలో 65,147 మందికి తీరని అన్యాయం



జిల్లాలో ఇలా..

కౌలు కార్డులు పొందిన రైతులు	65,147
రుణాలు పొందిన కౌలు రైతులు	23,314
భూములు కలిగిన రైతులు	2,48,000
భూధార్ నమోదు చేయించుకున్న వారు	1,66,237
జిల్లాలో సాగు భూమి ఎకరాలు (ఈ-క్రాప్ ప్రకారం)	4,90,560

ఏలూరు(మెట్రో): రైతులు ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సాయం, రాయితీలపై పనిముట్లు, పంటల బీమా ఇలా ఏ ప్రయోజనం పొందాలన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త మెలిక పెట్టాయి. ప్రతి ఒక్కరికీ ఆధార్ గుర్తింపు సంఖ్య మాదిరి రైతులకు సైతం భూధార్ గుర్తింపును కచ్చితం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిబంధన తీసుకువచ్చింది. దీంతో భవిష్యత్‌లో భూధార్ కార్డు ఉంటేనే రైతులకు ప్రయోజనాలు అందనున్నాయి. సొంతంగా భూమి ఉన్న రైతులే భూధార్‌కు అర్హులని వ్యవసాయశాఖ మెలిక పెట్టి, నమోదుకు చర్యలు తీసుకుంది. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం కానుంది.

భూధార్ ప్రామాణికం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు ప్రస్తుతం సొంత భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు, డీకే పట్టా భూములు ఉన్నవారికి, అటవీ భూములు సాగు చేసుకునే రైతులకు సైతం అందుతున్నాయి. పీఎం కిసాన్, వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీపై వ్యవసాయ పనిముట్లు, పంటల బీమా, మైక్రో ఇరిగేషన్ పథకాలు, రైతులకు ఇచ్చే రుణాలపై వడ్డీ రాయితీ వంటి ప్రయోజనాలను అన్నదాతలంతా పొందుతున్నాయి. అయితే ఇకపై వీటన్నింటికీ భూధార్ ప్రామాణికం కానుంది.

ఈనెల 25 వరకు గడువు

భూధార్ ఉంటేనే ఇకపై పథకాలు అందుతాయని కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూధార్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంది. రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతుండగా ఈనెల 25లోపు రైతులంతా వివరాలు నమోదు చేసుకోవాలని గడువు విధించింది. భూధార్ పొందేందుకు సొంతంగా భూము లున్న రైతులే అర్హులనడంతో కౌలు రైతులు, డీకే పట్టా భూములు ఉన్న రైతులు, అటవీ భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఈ అవకాశం కోల్పోతారు. జిల్లాలో 65,147 మందికి అధికారులు కౌలు గుర్తింపు కార్డులు అందించగా వీరిలో 23,314 మంది రుణాలు కూడా పొందారు. భూధార్‌తో జిల్లాలో 65,147 మంది కౌలు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులతో పాటు అటవీ భూములు సాగు చేసుకునే రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయంతో పాటు అన్నిరకాల ప్రయోజనాలు కల్పించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ యజమానులకు మాత్రమే పథకాలు వర్తించేలా భూధార్ ప్రక్రియ చేపట్టింది. రైతు అనే పేరు వినిపిస్తే అన్ని పథకాలు అందించాలని స్పష్టమైన ఆదేశాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు భూధార్ పేరుతో కౌలు రైతులు, ఇతర భూములను సాగు చేసుకునే రైతులను పథకాలకు దూరం చేస్తుందని కౌలు రైతులు వాపోతున్నారు.

ప్రతి ఒక్క రైతుకూ వర్తింపజేయాలి



ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్క రైతుకూ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులు, ఇతర భూములు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వ పథకాలు అందకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూధార్ ప్రక్రియను తీసుకువచ్చినట్టు అర్థమవుతోంది. ప్రతి ఒక్క రైతుకూ భూధార్ గుర్తింపు సంఖ్య ఇవ్వాలి. ఇప్పటికే కౌలు రైతులు పెరిగిపోయిన కౌలు, సరైన మద్దతు ధర రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కౌలు రైతులకు సైతం అన్ని ప్రయోజనాలు చేకూర్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– కె.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏలూరు

క్లుప్తంగా

ముగిసిన మదనగోపాల స్వామి కల్యాణోత్సవాలు



అత్తిలి మండలం బల్లిపాడు శ్రీమదనగోపాలస్వామికి పవళింపు సేవ

అత్తిలి: బల్లిపాడు శ్రీమదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు శ్రీపుష్పయాగోత్సవంతో ముగిశాయి. శ్రీ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో అలంకరించిన పల్లకీలో ఉంచి పవళింపు సేవ జరిపారు. ఆలయ అర్చకులు దంపతులకు తాంబూలాలు అందజేశారు. హాజరైన మహిళా భక్తులకు కుంకుమ భరిణీలు పంపిణీ చేశారు. లక్కీడ్రా నిర్వహించి డ్రాలో గెలుపొందిన ముగ్గురికి స్వామివారి చిత్రపటాలను ఆలయ ఈవో అందజేశారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు 12 రకాల ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శివకృష్ణ అశోక్, బుద్ధాల భాస్కరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, తోట శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ వ్యవహారంపై విచారణ



విచారణ చేస్తున్న తితిదే విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మి

భీమవరం: భీమవరం పట్టణంలోని శ్రీవేంకటేశ్వర బధిరోన్నత పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని అధికారులు ఆదివారం విచారించారు. ప్రిన్సిపాల్ పి.పద్మనాభరాజు తమను దూషించారంటూ పాఠశాలలో పనిచేస్తున్న దాదాపు 19 మంది ప్రైవేటు ఉద్యోగులు ఇటీవల ఆరోపించారు. ఈ విషయమై ఈనెల 10న పాఠశాలలో ఆందోళన వ్యక్తం చేయడంతో తాను తిట్టడం వాస్తవమని, మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తిట్టానని, మన్నించాలంటూ లేఖను ప్రిన్సిపాల్ రాసి ఇచ్చారు. ఉద్యోగం నుంచి కూడా తప్పుకుంటున్నానంటూ చెప్పారు. సంఘటన జరిగి వారం రోజులవుతున్నా తమకు న్యాయం జరగడంలేదని ఉద్యోగినులు ఆరోపించారు. దీనిపై నాలుగు రోజుల కిందట తమకు వచ్చిన ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు తితిదే విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మి చెప్పారు. నివేదికను ఈవోకు అందజేస్తానన్నారు.

పోస్టాఫీసులో చోరీ యత్నం

జంగారెడ్డిగూడెం: స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఆదివారం చోరీ యత్నం జరిగింది. పోస్టాఫీసు వెనుక తలుపుల తాళాలు పగులగొట్టి దుండగుడు లోనికి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నారు. నైట్ వాచ్‌మన్ ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చే సరికి పోస్టాఫీసు వెనుక తలుపు తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టాఫీసులో ఏవీ చోరీకి గురికాలేదని గుర్తించినట్లు పోలీసులు చెప్పారు.


పునరావాసం ఎక్కడ సారూ?

- జూన్ కల్లా నిర్వాసితులను తరలించేందుకు ప్రభుత్వం చర్యలు
- నేటికీ ఆప్షన్ 2 నిర్వాసితులకు స్థలాలు చూపించని వైనం

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలోని నిర్వాసిత గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ పరిహారాన్ని జమచేసిన ప్రభుత్వం వచ్చే జూన్ కల్లా వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ విషయమై ఇటీవల జరిగిన సమావేశంలో పనులు వేగవంతం చేసేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆప్షన్ 2 ను ఎంచుకున్న నిర్వాసితులకు ఇంతవరకు స్థలాలను అప్పగించలేదని ఉన్నట్టుండి గ్రామాలను ఖాళీ చేయమంటే తమ పరిస్థితి ఏంటని కొందరు నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.

స్థలం ఇవ్వనేలేదు.. ఖాళీ చేయమంటే ఎలా

పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో ముంపునకు గురవుతున్న గ్రామాలకు గతంలో సర్వే నిర్వహించిన ప్రభుత్వం ఆర్అండ్ఆర్ పరిహారానికి సంబంధించి నిర్వహించిన గ్రామసభలో నిర్వాసితుల వద్ద నుంచి ఆప్షన్ 1, ఆప్షన్ 2, ఆప్షన్ 3 కింద దరఖాస్తులను స్వీకరించింది. ఆప్షన్ 1 ఎంచుకున్న నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లించి ఇంటి నిర్మాణం ప్రభుత్వేమే చేపట్టి ఇస్తుంది. ఆప్షన్ 2 ఎంచుకున్న నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారంతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఎంత ఖర్చయితే చేస్తుందో ఆ మొత్తాన్ని నిర్వాసితుల ఖాతాల్లో జమచేస్తుంది. ఇంటి నిర్మాణాన్ని నిర్వాసితుడే చేపట్టుకోవాల్సి ఉంటుంది. ఆప్షన్ 3 ఎంచుకున్న వారికి ఇళ్లు, స్థలం రెండు వద్దనుకున్నారు కనుక వారికి ఆర్అండ్ఆర్‌తో పాటు ఆ రెంటికి అయ్యే ఖర్చును నిర్వాసితుల ఖాతాల్లో జమచేస్తుంది. ఈ విధంగానే ఇటీవల ఆర్అండ్ఆర్ పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది.



నిర్వాసితులకు అందించిన పట్టాలు



ఆప్షన్1 నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో నిర్మించిన ఇళ్లు

స్థలాలు అప్పగించండి



నేను కుక్కునూరు ఏ బ్లాక్ నిర్వాసితుడిని. ఆర్అండ్ఆర్ గ్రామ సభలో ఆప్షన్ 2 కు దరఖాస్తు చేసుకున్నాను. అయితే పునరావాస కాలనీల్లో నాకు కేటాయించిన స్థలానికి సంబంధించి పట్టాను అధికారులు అందించారు. కాని ఇంతవరకు నా స్థలం ఎక్కడుందో చూపించలేదు. మా స్థలాలను అప్పగిస్తే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటాం. అప్పటికప్పుడు ఇళ్లను ఖాళీ చేయమంటే మేము ఉన్నట్టుండి ఎక్కడికెళ్లాలో అధికారులే ఆలోచించాలి.

– వినపాల ప్రభాకర్, నిర్వాసితుడు, కుక్కునూరు

అయితే ఆప్షన్ 2 ను ఎంచుకున్న నిర్వాసితులకు ఇంతవరకు స్థలాలను స్థలాలను అప్పగించలేదు. దీంతో జూన్ కల్లా నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించే ప్రక్రియ చేపడితే స్థలాలను అప్పగించకుండా ఇంటి నిర్మాణం చేసుకోకుండా అప్పటికప్పుడు గ్రామాలను ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లాలని ఆప్షన్ 2కు దరఖాస్తు చేసుకున్న నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు తమకు స్థలాలను అప్పగిస్తే ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించుకుంటామని ఆప్షన్ 2 నిర్వాసితులు కోరుతున్నారు.

టెకు బ్యాంకు వ్యాపార విస్తరణకు ఆమోదం



టెకు బ్యాంక్ మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరుకు చెందిన ది ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (టెకు బ్యాంక్) వ్యాపారాన్ని మరిన్ని జిల్లాలకు విస్తరించాలని ఆ బ్యాంక్ మహాజన సభ ఆమోదించింది. ఆదివారం వైఎంహెచ్ఏ హాలులో టెకు బ్యాంక్ మహాజన సభ బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బ్యాంకు అభివృద్ధిపై సమీక్షించారు. కొత్త సభ్యత్వాలు, వాపసు చేసిన వాటాధనం ఆమోదించారు. వాయిదా మీరిన అప్పులపై సమీక్షించారు. బ్యాంకు చైర్మన్ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకు వ్యాపార పరిధి ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, అనకాపల్లి జిల్లాల్లో విస్తరించి ఉందని, బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లా, విశాఖపట్నం జిల్లాకు విస్తరించేందుకు ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు సిబ్బంది, సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా కళా పరిషత్ నాటికలు



మా ఇంట్లో మహాభారతం నాటికలో సన్నివేశం



ఇది రహదారి కాదు నాటికలో సన్నివేశం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో కళా పరిషత్ ఆధ్వర్యంలో రెండో రోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి. ఆదివారం మూడు నాటికలు ప్రదర్శించారు. ఇది రహదారి కాదు, (అ)సత్యం, మా ఇంట్లో మహాభారతం నాటికలు ఆకట్టుకున్నాయి. సమాజంలో దారితప్పిన యువ జంటకు సందేశాన్ని అందించేలా సాగిన మిత్ర క్రియేషన్స్ వారి ×ఇది రహదారి కాదు¤ నాటికను ఆకురాతి భాస్కర్ రచించగా, ఎస్ఎం బాషా దర్శకత్వం వహించారు. మద్దుకూరు ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికను మద్దుకూరి రవీంద్ర బాబు రచించగా.. నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. చెతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారు రచించిన అ(సత్యం) నాటిక కంటికి కనిపించేదంతా సత్యం కాదు.. కనిపించనిదంతా అసత్యం కాదు. అబద్ధమైనా సరే అది ఒక మంచికి దోహదపడితే అది సత్యం అని తెలిపేదే ఈ నాటిక. పిన్నమనేని మృత్యుంజయ రావు రచించగా.. పి.బాలాజీనాయక్ దర్శకత్వం వహించారు.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో భారీ మార్పులు

- 13 భాషల్లో ప్రవేశ పరీక్ష రాసే అవకాశం
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనుకునే యువతకు శుభవార్త. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రిక్రూట్‌మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రవేశ పరీక్షను ఏకంగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మరోవైపు రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశాఖపట్నం మరోసారి వేదిక కానుంది. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా, మచిలీపట్నం జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపికలు నిర్వహించాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నిర్ణయించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఏప్రిల్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కేటగిరీల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి, జనరల్ డ్యూటీ కేటగిరీలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారు. అలాగే 17.5 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే ఈ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాది కీలక మార్పులు

ఈ సారి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో పలు ముఖ్యమైన మార్పులు చేశారు. గతంలో అభ్యర్థులు ఒక కేటగిరీకి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో వంటి అదనపు విద్యార్హతలు కలిగిన వారికి బోనస్ మార్కులు లభిస్తాయి. గతంలో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను ఇప్పుడు తెలుగుతో సహా 13 భాషల్లో రాసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అడ్మిట్ కార్డులో ర్యాలీకి హాజరుకావాల్సిన తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయి. అభ్యర్థుల సౌకర్యం కోసం రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశంలో ప్రత్యేక రిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో పారదర్శకంగా జరుగుతుందని రక్షణ శాఖ తెలిపింది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం లైవ్ చాట్ సదుపాయంతో పాటు 'ఆర్మీ కాలింగ్'అనే ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరింత సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించ వచ్చు లేదా విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని 0891-2756959, 0891-2754680 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

చిన్నారులను హింసించిన ఘటనలో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: చిన్నారులను హింసించిన ఘటనకు సంబంధించి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఐసీడీఎస్ పీవో బ్యూలా, సూపర్‌వైజర్ లక్ష్మి పరామర్శించారు. శనివారం నుంచి చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నారు. మారుటి తండ్రి పుచ్చకాయల దుర్గాప్రసాద్ చిన్నారులు సాత్విక్, కరుణసత్యలను కొట్టి హింసించిన ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు. మరో రెండు రోజులు చిన్నారులను పర్యవేక్షణలో ఉంచనున్నట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల తెలిపారు. సాత్విక్‌కు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఘటనలో దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌జబీర్ తెలిపారు.



చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న ఐసీడీఎస్ పీవో బ్యూలా, సూపర్‌వైజర్ లక్ష్మి

ఖరీదైన బాటిళ్లలో చీప్ లిక్కర్

భీమవరం: ఖరీదైన బాటిళ్లలో చీప్ లిక్కర్ పోసి ఎక్కువ రేటుకు విక్రయిస్తున్న ముద్దాయిని అరెస్ట్ చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ బలరామరాజు తెలిపారు. ప్రధాన ముద్దాయి షణ్ముగం ప్రభును పీటీ వారెంట్‌పై చెన్నై నుంచి తీసుకొచ్చి న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా 15 రోజుల రిమాండ్ విధించారన్నారు. ఆరుగురు సభ్యులు ఉన్న ఈ ముఠాలో గత జనవరిలో ముద్దాయిలను గుర్తించి వారిని అరెస్ట్ చేశామన్నారు.

టెన్నిస్ పోటీలు ప్రారంభం



టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జాతీయస్థాయి టెన్నిస్ వంటి పోటీలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలను అంజిబాబు ప్రారంభించారు. 1982లో క్లబ్ ఏర్పడిన నాటి నుంచి జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షులు అల్లూరి పద్మరాజు, పీవీ రామరాజు, కార్యదర్శి వీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్లకు సూచనలు

గణపవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇన్విజిలేటర్లు విధుల నిర్వహణ కత్తిమీద సామే. అయితే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా విధులు నిర్వహించవచ్చని పలువురు సీనియర్ ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఇందుకోసం పలు సూచనలు చేస్తున్నారు.

- ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
- సెల్‌ఫోన్‌లు చీఫ్ సూపరింటెండెంట్‌కు అప్పగించాలి.
- లాటరీ ప్రకారం కేటాయించిన గదికి సంబంధిత మెటీరియల్‌తో వెళ్లాలి.
- ఓఎంఆర్ షీట్లు ఆర్డర్‌లో ఉన్నవా లేదా సరి చూసుకోవాలి.
- డబ్ల్యూ ఆకారంలో ఓఎంఆర్ షీట్లు, ఆన్సర్ షీట్లు ఇవ్వాలి.
- హాల్ టికెట్‌పై విద్యార్థి ముఖం, ఓఎంఆర్ షీట్లు సరిపోల్చుకోవాలి.
- విద్యార్థి గైర్హాజరయితే వారి స్థానంలో తప్పకుండా వారి ఓఎంఆర్, జవాబుపత్రాలు ఉంచాలి.
- మొదటి అరగంట తదుపరి డిపార్ట్‌మెంట్ అధికారి వచ్చి ఆబ్సెంట్ నమోదు చేసుకున్న తర్వాత ఓఎంఆర్ షీట్ కొట్టివేసి అక్కడ సంతకం చేయాలి.
- విద్యార్థుల వద్ద కాపీలు గాని, ఇతర అనుమతిలేని వస్తువులు కానీ లేకుండా చూసుకోవాలి.
- విద్యార్థులందరూ బయటకు వెళ్లిన తర్వాతే రూం వదిలి బయటకు రావాలి.

ఆరేళ్లకు చిక్కిన ముద్దాయి

ఏలూరు (టూటౌన్): ఏలూరు త్రీ టౌన్‌లో నమోదైన కేసులో ఆరేళ్ల నుంచి పరారీలో ఉన్న ముద్దాయిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. 2019లో నమోదైన చీటింగ్ కేసులో మూడో పట్టణ పోలీసులు పురోగతి సాధించారు. ఏ2 ముద్దాయిని అరెస్టు చేశారు. మూడో పట్టణ పరిధిలో 2019లో 140/2019 క్రైమ్ నెంబర్‌పై చీటింగ్ కేసు నమోదైంది. అమలాపురానికి చెందిన చిలుకూరి దీపక్ వర్మ విజయవాడకు చెందిన పొన్నం సైదేశ్వర చౌదరి, పొన్నం లక్ష్మీ కుమారితో కలిసి మలేషియాలో మ్యాన్ పవర్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు దానికి సంబంధించి కొంతమంది ఉద్యోగులను నియమించుకున్నట్లు తెలిపారు. ఏలూరుకు చెందిన గుడిపూడి చక్రవర్తి 22 మంది నిరుద్యోగులతో వారిని కలిశాడు. ఈ 22 మంది రూ.17.50 లక్షలు విమాన టికెట్లు, దారిఖర్చుల కోసం ఇచ్చారు. ఐదుగురికి విమాన టికెట్లు పంపారు. ఆ టికెట్లు తీసుకుని చెన్నై ఎయిర్‌పోర్టుకు వెళ్లగా అవి నకిలీవని గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు గత ఆరేళ్లగా పరారీలో ఉండగా మూడో పట్టణ సీఐ కోటేశ్వరరావు వారిలో సైదేశ్వర చౌదరని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.



ముద్దాయి సైదేశ్వర చౌదరిని అరెస్టు చేసిన ఏలూరు త్రీటౌన్ పోలీసులు

రైలు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి



మృతుడు నవీన్ సాగర్ (ఫైల్)

ఏలూరు టౌన్: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగి ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతిచెందారు. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఏలూరు సత్రంపాడు ప్రాంతానికి చెందిన సందోలు నవీన్ సాగర్(42) పెదవేగి మండలం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ఓఈటిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల రైల్వే ట్రాక్ సమీపంలో రైలు పట్టాలను దాటుతున్న సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. నవీన్ సాగర్ అక్కడికక్కడే మృతిచెందారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ట్రాక్‌కు దూరంగా మృతదేహం ఉండడంతో పలు అనుమానాలకు తావిచ్చింది. త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్య...హత్య? లేక ప్రమాదమా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

'పది' పరీక్షల సిబ్బంది నిబంధనలు పాటించాలి


ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పదో తరగతి పరీక్షల విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ సూచించారు. పరీక్షల సిబ్బంది విధిగా గుర్తింపు కార్డులు ధరించాలని, చీఫ్ సూపరింటెండెంట్‌లు పరీక్షా కేంద్రంలోని సిబ్బందితో బంధుత్వాలు లేవని విధిగా సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. స్టోరేజ్ పాయింట్‌లో ప్రశ్నాపత్రాలు తీసుకొన్న వెంటనే సరైన సంఖ్యలో ఉన్నాయో లేవో, ఆ రోజుకి సంబంధించిన సబ్జెక్ట్/ పేపర్ కోడ్ వంటివి సరిచూసుకోవాలని, పుకార్లు, అనధికార వార్తలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసే వ్యక్తులపై సైబర్ నేరం కింద చర్యలు తీసుకుంటారన్నారు. విద్యార్థుల సహాయార్థం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో 8466974001 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

పామాయిల్‌లో బొప్పాయి సాగు

ఎకరానికి 15 నుంచి 20 టన్నుల దిగుబడి



ఉంగుటూరు: మెట్ట ప్రాంతంలో పామాయిల్ తోటలో అంతర పంటగా బొప్పాయి సాగు చేస్తున్నారు. ఫలితాలు బాగండటంతో విస్తీర్ణం పెరుగుతోంది. రెండు సంవత్సరాల పంట కాలంలో దిగుబడి బాగుందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 15 నుంచి 20 టన్నులు దిగుబడి లభిస్తోంది. మండలంలోని రావులపాలెం చుట్టు పక్కల గ్రామాల్లోని బొప్పాయి నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చి పెంచుతున్నారు. పామాయిల్ మొక్క తోటలో బొప్పాయి పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు 900 మొక్కలు పడుతుండగా.. 8 అడుగులు వెడల్పులో బెడ్‌లు ఏర్పాటుచేసి మొక్కకి మొక్కకి మధ్య 6 అడుగులు వ్యత్యాసం ఉండేలా నాటాలి. పంట కాలంలో దోమ, నల్లి, తామర పురుగు ఆశిస్తే మందులు పిచికారి చేస్తే సరిపోతోంది. కేజీకి రూ.10 నుంచి రూ. 20 వరకు సీజన్ ప్రకారం ధర పలుకుతోంది. ఎకరాకు ఖర్చు రూ.లక్ష వరకూ అవుతుందని.. అయితే రూ.లక్షకు పైనే లాభం వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ పంటకు హార్టీకల్చర్ శాఖ సబ్సిడీ అందిస్తుంది. మల్చింగ్ షీటు వేస్తే ఎకరాకు 6400 సబ్సిడీ ఇస్తున్నారు. ఎకరాకు మరో రూ.9,865 సబ్సిడీ ఇస్తున్నారు. ఉంగుటూరు, ద్వారకాతిరుమల, నల్లజర్ల, భీమడోలు, కామవరపుకోట తదితర మండలాల్లో పామాయిల్ తోటలో అంతరపంటగా బొప్పాయి వేస్తున్నారు.





గొల్లగూడెం ఆయకట్టులో పామాయిల్ తోటలో బొప్పాయి సాగు

ప్రోత్సాహం బాగుంది



ప్రభుత్వం బొప్పాయి పంటకు ఇచ్చే ప్రోత్సాహం బాగుంది. ఎకరాకు మల్చింగ్ షీటుకు రూ.6,500, మొక్కలకు రూ.9,865 సబ్సిడీ ఇస్తున్నారు. వైరస్ తెగుళ్ల ఆశించే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చు.

మద్దిపాటి దిలీప్, ఉద్యాన వన సహాయకుడు, గొల్లగూడెం,

బొప్పాయి పంటతో మంచి లాభాలు



బొప్పాయి పంట అంతర పంటగా వేసుకునేందుకు అనుకూలంగా ఉంది. నా తోటలో కాపు బాగుంది. 2 టన్నులు సైకిళ్ల వాళ్లకి అమ్మాం. ఢిల్లీకి ఎగుమతి చేసేందుకు కొందరు వచ్చారు. పూర్వం అంతర పంటగా పొగాకు వేసే వాళ్లం. అయితే బొప్పాయి సాగు బాగుంది.

గన్నమని రామకృష్ణ, రైతు, గొల్లగూడెం

కూటమి మట్టి మాఫియాకు అడ్డేది?

- యథేచ్ఛగా మట్టి, కంకర అక్రమ రవాణా
- అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు
- కూటమి నాయకుల కనుసన్నల్లో అసాంఘిక కార్యకలాపాలు


తాడేపల్లిగూడెం పట్టణ వ్యూ

తాడేపల్లిగూడెం: జవసత్వాలు ఉడిగిన రింగ్ లీడర్ ఒకరు జగ్గన్నపేట నా జమానా అంటున్నాడు. ఆయన తనయుడు ఒకరు తన కుటుంబానికి గుర్తింపు తెచ్చిన మండలంలో మట్టి మాఫియాకు రాజాను చేయమని కోరుతున్నాడు. ఇదే మండలంలో మీరు ఎన్ని ఎత్తులైనా వేసుకోండి. ఏదైనా నా ద్వారా సెటిల్ కావాల్సిందే. పోలీస్ స్టేషన్‌లోనూ నాదే హవా అంటూ ఓ చిన్నోడు రెచ్చిపోతున్నారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటే పట్టణంలో ఒకరు అన్నయ్య ఆఫీస్ దగ్గర ఏ పనైనా మన ద్వారా జరగాల్సిందేనని అంటున్నాడు. మండలమైనా, పట్టణమైనా, మట్టికి, కంకరకు కాళ్లు రావాలంటే అతడి కనుసన్నల్లోనేనని పవర్ పాయింట్ షాడోగా ప్రచారం చేసుకొనే ఓ వ్యక్తి చెబుతున్నాడు. ఇటీవల నియోజకవర్గంలో మట్టి, కంకర మాఫియా పేట్రేగిపోయినట్టుగా కనపడుతోంది. చెరువులు, వ్యవసాయ భూములను వదలడం లేదు. వేసవి రావడంతో చెరువులను ఎండ గడుతున్నారు. గూడెం మండలంలో కంకర వనరులు అధికంగా ఉన్నాయి. చెరువులు లోతు చేస్తే అధిక మొత్తంలో కంకర వస్తుంది. రైతు ప్రయోజనాలకు తిలోదకాలిచ్చి, సాగునీరు ఆయకట్టు ఊపిరి తీసేలా మట్టి తవ్వకాలు స్థాయి పెచ్చు మీరినట్టు కనిపిస్తోంది. ఈ విషయంలో అంతర్గతంగా కూటమిలో బీజేపీ మినహా మిగిలిన పార్టీల నాయకుల మధ్య స్పర్థలు పొడచూపినట్టుగా కనపడుతున్నాయి.

అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు

రెవెన్యూ అలసత్వం, విజిలెన్సు మార్గదర్శకాల నిబంధనలు, మైనింగ్ శాఖలో సిబ్బంది, అధికారుల కొరత ఇవన్నీ కలిసి అక్రమార్కులకు అడ్డాగా మారింది. పూడిక చేయాలనుకొనే భూములకు కన్వర్షన్లు ఉండవు. రెవెన్యూ అధికారుల ఆమోద ముద్ర ఉండదు. రాత్రికి రాత్రే పాత భవనాలు కూలుతాయి. ఖాళీ స్థలం సాక్షాత్కరిస్తోంది. వెనువెంటనే లారీలకు లారీలు మట్టి కాని, కంకర గాని ఆ భూమిని నింపుతుంది. వెలుగులోకి వస్తే తూతూమంత్ర చర్యలు, లేకుంటే అంతా గప్‌చుప్ అన్నట్టుగా వ్యవహారాలు సాగుతున్నాయి.

వెల్లువెత్తుతున్న ఆరోపణలు

పెంటపాడు మండలంలో ఒక కుటుంబం తమ ఇంటి దిక్కును అధికారం ఉన్న వ్యక్తుల ప్రోద్బలంతో మట్టుపెట్టారని ఆరోపిస్తూ నిరసన దీక్షకు దిగింది. ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని, అక్రమార్కులను అధికారం ఉన్న వారు, యంత్రాంగం కట్టడి చేయాలని కోరుతున్నారు. ప్రజలు ఇచ్చిన అధికారం ఇది. ప్రజా సేవ చేయాలి. భుజబలం, అధికార బలం ఉందన్న కారణంగా ఇలా చేయడం సబబు కాదని, అధికారం అడ్డుపెట్టుకొని దోపిడీ చేస్తామంటే ప్రజలు తిరగబడతారని నాయకులు గమనించాలని పలువురు కోరుతున్నారు. ఇదంతా కూటమి నాయకుల కనుసన్నల్లోనే జరుగుతుందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పెరిగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు

అసాంఘిక కార్యకలాపాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. జూదం విశృంఖలంగా సాగుతున్నట్టుగా చెబుతున్నారు. అనుమతి పొంది చతుర్ముఖపారాయణం చేస్తే తప్పు కాదు. కూటమి నాయకులు కాకుండా వేరే వ్యక్తులు ఈ పారాయణం చేస్తుంటే ఆకస్మిక దాడులు చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. నియోజకవర్గంలో రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక చైతన్యవంత గ్రామంలో ఇటీవల జరిగిన దాడి, మరో మండల పరిధిలో వేరే పక్షానికి చెందిన కొందరు జూదం ఆడుతుండగా పట్టుకొని, సొమ్మును తక్కువగా చూపారనే ప్రచారం ఉంది. ఈ దాడి కూడా నాయకుల అండదండలతోనే జరిగినట్లుగా ప్రచారం ఉంది. డాబాల మాటున మద్యం యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారని అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తాజాగా ఆరోపణలు చేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పర్యావరణ ప్రేమికులు

ఉండి: ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించకపోతే ప్రాణాలకు హాని కలుగుతుందని పర్యావరణ ప్రేమికులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం ఉండిలో నల్లా విజయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికులు ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీరామ క్షేత్రంలో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. వాడి పారేసిన ప్లాస్టిక్ కవర్లు మట్టిలో కలవకపోవడంతో పర్యావరణం ప్రమాదంలో పడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అనంతరం పాల్గొన్న వారికి చేతిసంచులను అందజేశారు. కార్యక్రమంలో గుండాబత్తుల సుబ్బారావు, నల్లా ప్రసాద్, ఖండాపు శ్రీనివాసరావు, దాసరి వరదయ్య, ముదునూరి శివరామరాజు, ఆచారి మాస్టారు, మార్గెళ్ల కామేశ్వరి, అళగిరి సత్యానంద్, మాసాబత్తుల రామకృష్ణ, కాగిత మాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు


సూర్య భగవానుడు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి గాయత్రీ కల్యాణ మండపం సమీపంలోని సూర్య దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య భగవానునికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు గజమాల సమర్పణ


అమ్మవారికి అలంకరించిన గజమాల

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మకు తాడేపల్లిగూడేనికి చెందిన జ్యోష్ణవి, వెంకటేశ్వరావు, దుర్గ గజమాలను సమర్పించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు.

నేడు గౌరీదేవి ప్రతిష్ఠ పూజలు

పెంటపాడు: గ్రామ ఇలవేల్పు వెలమ సంఘ ఆరాధ్య దేవత గౌరీదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని సుమారు రూ.కోటికి పైగా నిధులతో నిర్మించినట్లు తెలిపారు. ఆగమ పండితులు తుని తపోవన మఠాధిపతులు అనంత సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా ప్రతిష్ఠకు సంబంధించి 17 వరకు నిర్వహించే పూజల్లో భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక యాగశాల ఏర్పాటు చేసి వేద పండితులు ప్రత్యేక పూజలు, ప్రతిష్ఠకు సంబంధించి అభిషేకాలు చేస్తున్నారు. 17న విగ్రహ ప్రతిష్ఠతోపాటు భారీ అన్నసమారాధన చేయనున్నట్లు తెలిపారు.

అన్నదాన పథకానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: మండలం సీసలి గ్రామంలో వేంచేసియున్న షిరిడి సాయిబాబా ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి అడవికొలనుకు చెందిన నారిన వెంకటేశ్వరావు, పుష్ప దంపతుల కుమార్తె సౌమ్యశ్రీ రూ.1,00,116 విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి కుటుంబ సభ్యులకు బాబా ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రం బాబా వారి ప్రతిమతో సత్కరించారు.

ఎంపీటీసీకి వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ


ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజును పరామర్శించిన ఎంపీపీ, జెడ్పీటీసీ

భీమవరం అర్బన్: మండలంలోని లోసరి పంచాయతీ ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజును వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు ఆదివారం తోకతిప్పలో పరామర్శించారు. ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఆరోగ్య పరిస్థితిలో విజయ నరసింహరాజు, నరసింహరావులు అడిగి తెలుసుకుని ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న వారికి అండగా ఉంటుందని అధైర్య పడవద్దని కొండరాజుకు భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, పెనుమాల నరసింహస్వామి తదితరులు ఉన్నారు.

రోడ్లపై తాండవిస్తున్న అపారిశుద్ధ్యం


సజ్జాపురంలో డ్రైయిన్‌లో నుంచి తీసిన పూడిక

తణుకు అర్బన్ : సజ్జాపురం వీధుల్లో దుర్గంధ పూరితమైన వాతావరణంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజుల క్రితం డ్రెయినేజీల్లో నుంచి బయటకు తీసిన పూడిక రోడ్లపైనే వదిలేయడంతో వీధులు మురికికూపంగా మారాయి. తీసిన బురద ఎండిపోయి గుట్టలుగా మారినా వాటిని దూరంగా తరలించే పనులు చేపట్టకపోవడంతో సజ్జాపుర వాసులు గగ్గోలు పెడుతున్నారు. తమ ఇళ్ల ముందు డ్రెయినేజీ పూడికను గుట్టలుగా వేశారని పది రోజులు గడిచినా ఇంతవరకు మునిసిపల్ అధికారులు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి ఇంటి ముందు డ్రెయిన్స్ పూడిక ఉంచడం ఏమిటని నిలదీస్తున్నారు. గతంలో ఎప్పుడైనా ఇలా ఉందా అంటూ ప్రశ్నిస్తున్నారు. తీసిన పెంట ఇంటి ముందు పెట్టే కంటే డ్రెయిన్లలోనే ఉంచండని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా సజ్జాపురంలోని రామకృష్ణ మఠం వీధి, కోయాక్సిల్ రోడ్డు, పార్కురోడ్డుల్లో డ్రెయిన్లలో నుంచి తీసిన పూడిక గుట్టలు దుర్గంధంగా మారాయి.

107 మందికి ఉచిత నేత్ర పరీక్షలు


వైద్యులు నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక కడకట్ల జనతా ట్రస్ట్ ఆవరణలో దాత పదం కుమార్ గుప్తా సహకారంతో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిలంచారు. 107 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించగా, ఉచితంగా 21 మందికి కళ్లజోళ్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 13 మందిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్యేక ట్రీట్‌మెంట్ నిమిత్తం 21 మందిని నిడదవోలు ఆసుపత్రికి తరలించేందుకు నిర్ణయించారు. కంటి వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాస్, దాట్ల లక్ష్మీపతి రాజు, మదన్మోహన్ అగర్వాల్, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, పచ్చా వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి


జగనన్న కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు

నరసాపురం రూరల్: జగనన్న కాలనీలో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మంగళగుంటపాలెంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలంలో పది ఎకరాలను పూడిక చేసి 630 ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఈ స్థలాలలో సుమారు 50 కుటుంబాలు గృహాలను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నారని, కానీ ఆ కుటుంబాలకు తాగడానికి మంచినీళ్ల సదుపాయం లేక సుదీర్ఘ ప్రాంతాల నుండీ నీరు తెచ్చుకునే దుస్థితి నెలకొందని తెలిపారు. వర్షాకాలం వస్తే రోడ్లు బాడిబంద, బురదతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- నియోజకవర్గంలో 19 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 5528 మంది విద్యార్థులు


జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

తణుకు అర్బన్ : ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తణుకు నియోజకవర్గంలోని తణుకుతో పాటు మున్సిపాలిటీ, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 5528 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా తణుకు మున్సిపాలిటీ, తణుకు మండలానికి సంబంధించి 12, ఇరగవరం 3, అత్తిలి 4 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. ఆయా కేంద్రాల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం ఆదివారం డెస్కులపై హాల్ టికెట్ నంబర్లు వేయగా, హాల్ టికెట్లు నంబర్ల వారీగా పరీక్ష నిర్వహించే రూం వివరాలు తెలిపే విధంగా ఆయా పాఠశాలల్లో బోర్డులు ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తణుకు డివిజన్ పరిధిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీవైఈవో టి.మురళీ సత్యనారాయణ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఉంటుందని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్ష కేంద్రంలోకి ఒక అరగంట ముందుగానే విద్యార్థులను అనుమతిస్తామని, పరీక్ష సమయం పూర్తయ్యే వరకు విద్యార్థులను బయటకు పంపించమని చెప్పారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్ష నిర్వహణ ఉంటుందని పర్యవేక్షణలో భాగంగా కేంద్రాల్లో అధికారుల తనిఖీ ఉంటుందని, ఫ్లైయింగ్ స్క్వాడ్లు కేంద్రాల్లో తనిఖీలు చేపడతాయని వివరించారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. పట్టణంలో ఎనిమిది సెంటర్లలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల కోడ వెంకట్రావు మున్సిపల్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీచైతన్య, నారాయణ, కింబర్లీ, సెంట్ జోన్స్ సెంటర్లు ఉన్నాయి. ఉదయం 8.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా హాల్‌కు పంపనున్నారు. తెలుగు పరీక్ష నిమిత్తం మొత్తం 1,782 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అన్ని సెంటర్లలూనూ విద్యార్థినీ, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. బెంచీలు, డెస్కులు, నీటి వసతి, గదుల్లో వెలుతురుతో పాటు, ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా అవసరమైన మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచినట్లు, అదే విధంగా బాత్‌రూంలు, టాయిలెట్స్ అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

ఉచిత ధ్యాన శిక్షణ


ధ్యానంలో పాల్గొన్న సభ్యులు

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో యోగానంద పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భీమవరానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ మామిడి లక్ష్మణ్ పాల్గొని జ్ఞానబోధ చేసి ధ్యానశిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత తో పాటు దుఃఖ రాహిత్యస్థితి పొందవచ్చునని తెలిపారు. అనంతరం సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, మెంటే అరుణ, కె.మోహన్‌కుమార్, పోలిశెట్టి బాబి, శిరీష, సుబ్బరాజు, నాగ ధనలక్ష్మి, పంజా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఐఎల్‌టీసీలో హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎల్‌టీసీ కన్వీనర్ కలవకొలను నాగ తులసీరావు

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఐఎల్‌టీసీ కన్వీనర్ కలవకొలను నాగ తులసీరావు తెలిపారు. ఆదివారం ఈ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21నుంచి 25వ తేదీ వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఎక్స్‌పోలో భారతదేశంలో ప్రసిద్ధిచెందిన చేతి ఉత్పత్తుల కళాఖండాలు, ఫ్యాషన్ జ్యూయలరీ, గృహోపకరణాలు, లేసుఉత్పత్తులు, కలంకరీ శారీస్, ఫ్యాషన్ హ్యాండ్‌బ్యాగ్స్, రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్ కోర్టులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు ఆడుకునేందుకు ప్లేజోన్ ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. షాపింగ్ ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రవేశం ఉచితం అన్నారు. ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీ క్రాఫ్ట్స్ (ఈపీసీహెచ్) ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తులసీరావు తెలిపారు. ఈ సమావేశంలో ఈపీసీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ సింగ్, లేసు ఎగుమతిదారులు కలవకొలను తాతాజీ, అడ్డగళ్ల బాబు, కె.రాజీవ్, కె.సాంబమూర్తి, టి.నటేష్ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో చండీ సహిత రుద్రయాగం

కాళ్ల: కలవపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీఉమా భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం చండీ సహిత సహస్రరుద్రయాగ పూర్వక అష్టోత్తర శతకలశ అభిషేకాలు, అభిషేక సహిత సామ్రాజ్య పట్టాభిషేకం, స్వామి వారి లీలా కల్యాణం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో లోక కల్యాణార్థం రామకోటి, శివకోటి స్థూపస్థాపనలు నిర్వహించారు. అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహిస్తున్న వీసీ గోపాల్

తాడేపల్లిగూడెం (టీటీసీ): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని, ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి సత్రం వద్ద ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ నాయకులు, సభ్యులు హాజరై మాట్లాడుతూ పొట్టి శ్రీరాముల జీవిత విశేషాలు, ఆంధ్రరాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన విధానం, రాష్ట్ర సాధన, తదితర విషయాలను చర్చించారు. ఆర్య వైశ్యులు మారం వెంకటేశ్వరరావు, నున్న సుందరరావు, పేరూరి కాశయ్య, మండవల్లి చెన్నా నాగేంద్రరావు, పద్మనాభుని మురళీ, పసుమర్తి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాముల జీవితం స్ఫూర్తిదాయకం

తణుకు అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని ఆయన విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ఆయన చేసిన పోరాటం, అనుభవించిన జైలు జీవితం సాహసోపేతమైందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పొట్ల సురేష్, పుల్లెపు సూర్యచంద్రరావు, రాచమళ్ల సత్యనారాయణ, గెద్దా శ్రీకాంత్, కొమ్మోజు రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ, వై.రామకృష్ణ, షేక్ జిలాని, చింతలపూడి సూర్యనారాయణ, పెంటా నరేష్, పి.చింతన్న, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

తాడేపల్లిగూడెం: అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఉద్యానవర్సిటీ వీసీ కె.గోపాల్ అన్నారు. ఆదివారం ఉద్యానవర్సిటీ పాలనా భవనంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఆయన పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు చేసిన మహోన్నతమైన ఆత్మత్యాగం వెలకట్టలేనిదన్నారు. చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉండే త్యాగం ఆయనదన్నారు. త్యాగధనుల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు చెబుతూ ఉండాలన్నారు. విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు, కిరణ్, శ్రీనివాసు ఆదిత్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం (టీటీసీ): పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు


తణుకు అర్బన్: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కేంద్ర మంత్రికి పరామర్శ

భీమవరం: కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఇటీవల న్యూఢిల్లీలో ఇటీవల సంభవించిన ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన విషయం విధితమే. ఆదివారం కేంద్రమంత్రి స్వగృహానికి వీరు స్వయంగా వెళ్లి ఆయనను పరామర్శించారు.